క్లుప్తంగా

కుక్కల స్వైర విహారం



వీధి కుక్కలు దాడిలో మృతి చెందిన గొర్రెలు

వీఆర్‌పురం: రేఖపల్లి గ్రామం గొల్లగూడెంలో వీధి కుక్కలు మంగళవారం స్వైర విహారం చేశాయి. రెండు గొర్రెలపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలు, మేకలు, పశువులపై తరచూ కుక్కలు దాడి చేస్తున్నాయని బాధిత రైతు లక్ష్మణ్‌రావు వాపోయారు. మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మధుర జ్ఞాపకాలకు ప్రతిబింబం ఫొటోలు



ఫొటోగ్రఫీ శాస్త్రవేత్తల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

ముంచంగిపుట్టు: కరిగే కాలంలో చెరిగిపోని మధుర జ్ఞాపకాలకు ప్రతిబింబాలు ఫొటోలని మండల ఫొటో, వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సన్యాసిరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం 187వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ శాస్త్రవేత్తలు లూయిస్ డాగ్యురే, జోసెఫ్ నీసోఫర్ నీప్స్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సన్యాసిరావు మాట్లాడుతూ ఫొటో అనే ఒక్క చిత్రం అనేక భావాల సమాహారమన్నారు. ఫొటోలు తీయడం అంటే కేవలం కెమెరాను క్లిక్‌మనించేదే కాదని, ఫొటో తీసే వ్యక్తి మదిలో సృజనాత్మకత, భావపరిమళం తోడైతే ఫొటోలు జీవకళ ఉట్టిపడేలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విక్రమ్, అనిల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు అవసరం



గంగవరం జెడ్పీహెచ్ పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం: డీ గ్రేడ్ విద్యార్థులను ఏ గ్రేడ్ స్థాయిలోకి తీసుకువచ్చేందుకు సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు 66 మందికి 40 మంది మాత్రమే హాజరుకావడంతో హాజరు శాతం పెంచాలని సూచించారు. నూరు శాతం హాజరు ఉండేటట్లుగా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా లీప్, ఆన్‌లైన్ హాజరు నమోదు చేయాలని సూచించారు. టీచర్స్ డైరీలు, లెసన్ ప్లాన్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చట్రాయ్‌పల్లిని సందర్శించిన తహసీల్దారు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దారు అన్నాజీరావు

గూడెంకొత్తవీధి: కిందటి ఏడాది వరదలకు చట్రాయ్‌పల్లి గ్రామంపై కొండ చరియలు విరిగిపడడంతో కలెక్టర్ ముందస్తు చర్యల్లో భాగంగా తహసీల్దారు అన్నాజీరావు మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. తోకరాయి గ్రామాన్ని కూడా ఆయన సందర్శించారు. వర్షాలు కురుస్తున్నందున కిందటి నేడాది సంఘటనను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ఈకేవైసీ పూర్తి చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

గూడెంకొత్తవీధి: తల్లికి వందనం ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీ–4 కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లపై సర్వే చేసి, నిర్మాణాలను చేయాలన్నారు. పాఠశాలల సేఫ్టీ ఆడిట్‌లను నిర్వహించాలని చెప్పారు.

ప్రయాణం.. నరకప్రాయం.!

- అధ్వానంగా లోతుగెడ్డ–కోరుకొండ రహదారి
- వంద గ్రామాల ప్రజలు రాకపోకలకు నానా అవస్థలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



లోతుగెడ్డ వంతెన సమీపంలో అధ్వానంగా ఉన్న కోరుకొండ రహదారి



కోటగున్నలు వద్ద గోతులతో చెరువును తలపిస్తున్న రోడ్డు



రామారావుపాలెం సమీపంలో రాళ్లుతేలి ప్రమాదకరంగా మారిన రహదారి

చింతపల్లి: స్వాతంత్య్రం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా ఏజెన్సీలో మారుమూలన విసిరేసిన రాళ్ల వలే పడి ఉన్న గ్రామాలకు రహదారి సౌకర్యం లేదంటే అతియోశక్తి కాదు. పేరొందిన ప్రదేశాలకు కూడా నేటికి పూర్తి స్థాయి రోడ్డు సౌకర్యం లేదంటే ఆ ఆదివాసీలు చేసుకున్న పాపం ఏంటో అర్థం కాని పరిస్థితి. ఆ కోవకు చెందినదే ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతాలను కలిపే లోతుగెడ్డ వంతెన నుంచి కోరుకొండ రహదారి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనవరి నాటికే గుంతలు లేని రోడ్ల నిర్మాణం చేపడతామని ప్రగల్భాలు పలికిన నేతలు.. ఏడాది దాటినా అతీగతీ లేదు. కనీసం రాకపోకలు సాగించడానికి వీలుగా కూడా రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టలేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి మండలం పరిధిలో లోతుగెడ్డ వంతెన నుంచి కోరుకొండ వరకూ ఉన్న అంతర్రాష్ట్ర రోడ్డు అధ్వానంగా మారడంతో 100 గ్రామాల అదివాసీ ప్రజలు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఈ రహదారి చింతపల్లి మండలంలో ఉన్నటువంటి లోతుగెడ్డ పంచాయతీలో కొన్ని గ్రామాలతో పాటు కుడుముసారి, బలపం పంచాయతీ పరిధిలోని 60 గ్రామాలకు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ రహదారిపై వర్షం పడినప్పుడే కాకుండా సాధారణ రోజుల్లో కూడా ప్రయాణాలు సాగించలేని పరిస్థితి నెలకొంది. లోతుగెడ్డ వంతెన నుంచి రాళ్లగెడ్డ గ్రామం వరకూ రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో పాటు మోకాలు లోతు గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు రాకపోకలకు చుక్కలు చూస్తున్నారు. చింతపల్లి మండలంతో పాటు ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఉన్నటువంటి అనేక గ్రామాలకు సైతం ఈ మార్గమే దిక్కుగా ఉంది. ఈ పంచాయతీల పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు మండల కేంద్రం నుంచి పాఠశాలలకు, డీఆర్ డిపోలకు, బలపం ఆశ్రమ పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఏ సరుకులు తీసుకెళ్లాలన్నా ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించాలి. ప్రధానంగా బలపం పంచాయతీలో గిరిజనులతో పాటు ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఉన్న ఆదివాసులకు ఏ మాత్రం అనారోగ్యం చేసినా వైద్యానికి కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చింతపల్లికి తీసుకురావాలంటే ఈ మార్గం తప్పితే ప్రత్యామ్నాయ దారి లేదు. సుమారు వంద గ్రామాలకు పైగా ఉన్న కొండ ప్రాంతం నుంచి ముఖ్యంగా గర్భిణులు, బాలింతలను, రోగులను తరలించడానికి అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లోతుగెడ్డ–కోరుకొండ రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

తక్షణం రోడ్డు నిర్మాణం చేపట్టాలి



లోతుగెడ్డ వంతెన నుంచి రాళ్లగెడ్డ వరకూ పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలి. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించడానికి అనేక గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సైతం రావడం లేదు. ఈ రోడ్డు పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులకు ఎన్నో సార్లు అభ్యర్థించాం. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా రోడ్డు సమస్యను సంబంధిత అధికారులు తక్షణం పరిష్కరించాలి.

– కొర్రా రమేష్‌నాయుడు, సర్పంచ్, బలపం పంచాయతీ

గిరిజనేతర భూముల్లో జెండాలను పాతడం తగదు

తహసీల్దార్‌కు అఖిల పక్ష నాయకుల వినతి



తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న అఖిల పక్షం నాయకులు

వీఆర్‌పురం: గిరిజనేతర నిర్వాసిత రైతుల భూముల్లో సీపీఎం, అనుబంధ గిరిజన సంఘం పాతిన జెండాలను తీసివేయాలని అఖిల పక్షం నాయకులు స్థానిక తహసీల్దార్ సరస్వతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పోలవరం నిర్వాసిత భూములకు ఇచ్చిన గిరిజనేతర భూముల్లో సీపీఎం జెండాలు పాతడం సరికాదన్నారు. భూఆక్రమలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనేతరులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, టీడీపీ సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, జనసేన మహిళ అధ్యక్షురాలు బాగుల ప్రమీల, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బొడ్డు సత్యనారాయణ, మోడం నరేష్, ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతరావు, పెట్ల రాజు, మాచర్ల వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలి



జి.మాడుగుల కేజీబీవీలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: విద్యార్థినులు చదువుతో పాటు భవిష్యత్తుల్లో ఉద్యోగ, రాజకీయం, ఇలా అన్ని రంగాల్లోను రాణించాలని పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ షణ్ముఖరావు ఆకాంక్షించారు. జి.మాడుగులలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'శక్తి యాప్'పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలో విద్యార్థినులు అన్ని రంగాల్లో ప్రయోజకులై తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. నేటి విద్యార్థినులపైనే రేపటి దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలి



సుప్రీంకోర్టు న్యాయవాది బాజ్జీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి, తదితరులు

చింతపల్లి: విద్యార్థులు విద్యాభ్యాస దశ నుంచే మేథోసంపత్తిపై సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సుప్రీంకోర్టు న్యాయవాది వై.బాజ్జీ అన్నారు. చింతపల్లి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటలెక్చువల్ ప్రోపర్టి రైట్స్, సాంకేతిక పరిజ్ఞానంపై జరుగుతున్న జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమంలో ఆయన మంగళవారం ముఖ్య వక్తగా మాట్లాడారు. మేధో సంపత్తి అనేది ఒక వ్యక్తి, ఒక సంస్థ కృషి వల్ల ఏర్పడిన సృష్టి అని అన్నారు. దీనిని రక్షించుకోవడానికి మేథో సంపత్తి హక్కులు ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు జగదీష్, లీలాపావని, సంతోషి, కెజియారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీడని వర్షం.. స్తంభించిన జనజీవనం



వర్షంతో నిర్మానుష్యంగా ఉన్న సీలేరు మెయిన్ రోడ్డు

సీలేరు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు సీలేరు పరిసర ప్రాంతాల్లో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. కూలి పని చేసుకునే గిరిజనులు ఇళ్లకు పరిమితమయ్యారు. మారుమూల ప్రాంతాల్లో వాగులు, గెడ్డలు ఇంకా పొంగి ప్రవహిస్తున్నాయి. సప్పర్ల రేంజ్ నుంచి సీలేరు వరకు ఉన్న మార్గం ఘాట్ రోడ్ కావడంతో వర్షం కారణంగా ప్రయాణానికి ఆటంకం కలుగుతుంది. ఈ వర్షాలు వ్యవసాయ పంటలకు ఎంతో మేలు చేస్తుందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జర్సింగి రామ్‌నాయుడు కుటుంబానికి పరామర్శ



జర్సింగి రామ్‌నాయుడు కుటుంబాన్ని ఓదార్చుతున్న చంద్రబాబు, తదితరులు

పెదబయలు: వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గం నాయకుడు జర్సింగి రామ్‌నాయుడు తండ్రి బుల్లినాయుడు అనారోగ్యంతో మృతి చెండడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు అన్నారు. మంగళవారం అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచన మేరకు గుంజివాడ గ్రామంలోని బుల్లినాయుడు పార్థవదేహం వద్ద పార్టీ మండల నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. దహన ఖర్చులకు ఎమ్మెల్యే తరపున గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తెరవాడ అన్నమ్మ, పార్టీ నాయకులు తెరవాడ వెంకటరావు, సందడి కొండబాబు, మాజీ సర్పంచ్ భూపన్న, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అప్రమత్తత అవసరం

- బ్యాడ్, గుడ్ టచ్‌లపై అవగాహన
- మంప ఎస్‌ఐ శంకరరావు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శంకరరావు

కొయ్యూరు: బాలికలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మంప ఎస్‌ఐ శంకర్‌రావు సూచించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో 9, 10, ఇంటర్ బాలికలకు రక్షణపై ఆయన మంగళవారం అవగాహన కల్పించారు. మోసగించే వారిపై అప్రమత్తత అవసరమన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. ఆత్మరక్షణపై దృష్టి సారించాలని చెప్పారు. ఇప్పట్నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు నిరంతర కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంకిపాటి గాంధీ, ఎంఈవో రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బురద నీరే దిక్కు.!



బురదనీరు తీసుకెళ్తున్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: ఇటీవల కురిసిన వర్షాలకు జెర్రెల పంచాయతీ కొండకించంగి గ్రామంలో గిరిజనులకు బురద నీరు దిక్కవుతోంది. గ్రామంలో సురక్షిత తాగునీరు లేకపోవడంతో స్థానికులు చెలమ చేసుకుని దానిలో నీటిని తాగుతున్నారు. వర్షాలకు కాలువలు ఉధృతం కావడంతో చెలమ అంతా బురద నీటితో నిండిపోయింది. దీంతో గత్యంతరం లేక ఆ నీటినే తీసుకెళ్లి మరగబెట్టుకుంటున్నారు. ఈ నీరు తాగితే రోగాలు వస్తాయని గిరిజనులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే దృష్టి సారించి, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

వర్షాలకు పాడైన రోడ్లను బాగు చేయాలి



జర్జులలో పాడైన తారు రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: వర్షాలకు పాడైన రోడ్లను బాగు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు డిమాండ్ చేశారు. మండలంలోని జర్జుల పంచాయతీలోని గుంజిరిసంత నుంచి పెద్ద తమ్మెంగుల, చిన్నతమ్మెంగుల వరకు 7 కిలోమీటర్ల తారు రోడ్డు వర్షాలకు పాడైపోయింది. మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల నేతలు పాడైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ తుపాన్‌తో రహదారులు పాడై గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జర్జుల పంచాయతీలో 7 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించి, బాగు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ కార్యదర్శి జగన్నాథంపడాల్, వార్డు మెంబర్లు, పంచాయతీ కన్వీనర్లు సుధీర్‌కుమార్, ఆనందరావు, భీమలింగంపడాల్, గోపాలరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పెదబరడ రైతు సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి

చింతపల్లి: గిరిజన రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని ప్రాంతీయ పరిశోధన స్థానం విస్తరణ విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్ రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం పెదబరడ పంచాయతీ కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాట్లు వేసే ముందు వరి నారు చివర ఆకులు తుంచి, జీవామృతంలో ముంచి పలుచగా ఒకటి, రెండు మొనలతో నాటుకోవాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే పెట్టుబడులు తగ్గుతాయన్నారు. అనంతరం పెదబరడ సచివాలయంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మధుసూదన్‌రావు మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులు, వ్యయసాయ యాంత్రీకరణ, నూతన సాంకేతిక పద్ధతులు, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, జోగారావు, సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ లోవరాజు, పశువైద్యాధికారి చల్లంగి షాలిని, కార్యదర్శి లక్ష్మికుమార్, ఏఏ భవాని, ఆత్మ ఏటీఎం మహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



దుర్గమ్మకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులు, భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో శ్రీదుర్గమ్మతల్లి ఆలయ మొదటి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గమ్మతల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యల్లో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీసా సుభాష్‌చంద్ర, సుజనకోట ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, శంకర్, నాగమణి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



ముంచంగిపుట్టులో తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పాడేరు డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.వి.నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు సుజనకోట, పనసపుట్టు, ఒంటిపుట్టు, కొండపడ, చోటముఖిపుట్టు గ్రామాల్లో ఉన్న తాగునీటి పథకాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ముంచంగిపుట్టులో మరమ్మతులకు గురైన తాగనీటి పథకం పరిస్థితిపై ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని, గ్రామాల్లో తాగునీటి బోర్లు, గ్రావిటీ పథకాల నిర్వహణపై ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి పథకాలు, పనితీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నట్టు చెప్పారు. పాడైన నీటి పథకాల మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తామన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న తాగునీటి పథకాల పనులు శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

వర్కుగుమ్మి వాగుపై వంతెన లేక అవస్థలు



వంతెన నిర్మించాలని ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు,వర్కుగుమ్మి గ్రామ గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ వర్కుగుమ్మి గ్రామ సమీపంలోని వాగుపై వంతెన నిర్మించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళన చేశారు. మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తున్న వర్కుగుమ్మి వాగు వద్ద వంతెన నిర్మించాలని, రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తొలగించాలని గిరిజనులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వర్కుగుమ్మి గ్రామానికి సరైన రహదారి లేకపోవడం దారుణమన్నారు. వర్కుగుమ్మి వాగు పొంగి గత మూడు రోజులుగా గ్రామ గిరిజనులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వర్కుగుమ్మి గ్రామానికి పక్కా రహదారి, వాగుపై వంతెన నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో నారాయణ, గిరిజన సంఘం నేతలు, వర్కుగుమ్మి గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.